## క్లుప్తంగా

### బడ్జెట్ ఆమోదం

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం శనివారం జరిగింది. ఎంపీడీవో పి.రవికుమార్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను సవరించిన మండల అంచనా బడ్జెట్ వివరాలను చదివి వినిపించగా, సభ్యులు దానిని ఆమోదించారు. బడ్జెట్ ప్రారంభ నిల్వ నిధులు రూ.6,76,7,980గా చూపగా అంతిమంగా మిగిలినది రూ.70,19,560లుగా వెల్లడించారు. 2025–26వ ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను రాబడుల కింద రూ.119,13,9,500 గాను వ్యయం పోను అంతిమ నిల్వగా రూ.62,11,360గా సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

### అభ్యసన సామర్థ్యాల పరిశీలన

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో ఎంవీ ప్రసాదరావు శనివారం సందర్శించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిరిపురపు గణపతినాయుడు పాల్గొన్నారు.

### ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి

మెంటాడ: ప్రభుత్వ పథకాలు పొందాలనుకునే వారు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ, ఆధార్ లింక్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపీడీవో కూర్మనాథ్ పట్నాయక్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రభుత్వ పథకాల నగదుతో పాటు ఉపాధి హామీ పథకం డబ్బులు జమ కావాలన్నా లింక్ చేసుకోవాలన్నారు. హెచ్‌టీటీపీఎస్://ఎన్‌పీసీఐ.ఓఆర్‌జీ.ఇన్‌ను సంప్రదించి, లింక్ చేసుకోవచ్చన్నారు. లింక్ చేసుకునేటప్పుడు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోస్టాఫీసులు, బ్యాంకులకు వెళ్లి కూడా చేసుకోవచ్చన్నారు. ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

### మెరుగైన వైద్యం అందించాలి

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీడీవో శ్యామలాకుమారి శనివారం సందర్శించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని రకాల మందులు పీహెచ్‌సీల్లో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చలమయ్య, రీనాచౌదరి, ఈవో రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

బొబ్బిలి: ప్రభుత్వం మొద్దునిద్ర వీడి, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వరి కోతలు పూర్తయినా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడం దారుణమన్నారు. రైతులు నూర్చిన ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉందని, వాటిని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆఖరికి నష్టానికి దళారులకు విక్రయించుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

### భూ సమస్యలు పరిష్కరించండి

బాడంగి: భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు, రీసర్వే డీటీలతో శనివారం వీసీ(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అధికారుల దృష్టికి రైతులు తీసుకువచ్చిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామసభల ద్వారా 1103 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు సుధాకర్ తెలిపారు.

### భూసార పరీక్షల ధ్రువీకరణ పత్రాల పంపిణీ

రేగిడి: మండలంలోని 25 గ్రామ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు భూసార పరీక్షల ధ్రువీకరణ పత్రాలు శనివారం అందజేశారు. సర్టిఫికెట్‌లో ఉన్న వివరాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం చేపట్టాలని ఏవో మురళీకృష్ణ తెలిపారు.

### నేడు గణిత ప్రతిభా పోటీలు

రాజాం: పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పోటీ పరీక్షలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గణిత వేదిక ప్రతినిధి హుస్సేన్ శనివారం తెలిపారు. మండల స్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులు క్లస్టర్ స్థాయిలో, అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఇప్పుడు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. వీరిలో ఎంపికైన విద్యార్థులకు డిసెంబరు 22వ తేదీన జిల్లా కేంద్రాల్లో జరిగే గణిత దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు అందించామన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో గణితంలో వెనుకబడిన విద్యార్థులకు గణిత దీప్తి పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఏపీ మ్యాథ్‌మెటిక్ ఫోరం రాజాం ప్రాంతీయ ఉపాధ్యాయులు ఎస్.హుస్సేన్, టి.కృష్ణంరాజు, శివకుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గాలికుంటుతో ప్రమాదం!

- గాలికుంటు వ్యాధి బారినపడుతున్న పశువులు, గొర్రెలు
- తగ్గుతున్న పాల దిగుబడి
- రోగం ముదిరితే మూగజీవాలు మరణించే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు





బి.జయప్రకాష్, పశుసంవర్థక శాఖ ఏడీ

రాజాం సిటీ: పశువులు, గొర్రెలకు సోకే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి చాలా తీవ్రమైంది. వ్యాధి బారినపడిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతోంది. వ్యాధి తీవ్రత అధికమైతే మూగజీవాలు మరణించే అవకాశం కూడా ఉందని పశువైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువగా నవంబరు, డిసెంబరు నెలల్లో ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధి సోకకుండా టీకాలు ముందుగానే వేయించుకోవాలని, అప్పుడే వ్యాధి నిర్మూలనకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. సంకర జాతి పశువుల్లోనే ఈ వ్యాధి ముఖ్యంగా కనిపిస్తుందని, వ్యాధి లక్షణాలు, వ్యాప్తి తదితర అంశాలపై పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బొత్స జయప్రకాష్ పలు సూచనలు చేశారు.

**వ్యాధి సోకే విధానం, లక్షణాలు..**

సూక్ష్మజీవుల వల్ల ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల్లో పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా వాటి పాల ద్వారా దూడలకు కూడా వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన మూగజీవాల్లో నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. చర్మం కూడా గరుకుగా తయారవుతుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలు తాగిన దూడలు మరణించే అవకాశం ఎక్కువగా ఉంది. జ్వర తీవ్రత 104 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు ఉంటుంది. దీంతో పశువులు నీరశించిపోతాయి. గిట్టల్లో పుండ్లు ఏర్పడడం వల్ల పశువులు మేతకు కూడా కదల్లేని పరిస్థితి నెలకొంటుంది. నోటి సంచల కారణంగా ఇంటి వద్ద కుడితి కూడా తాగేందుకు పశువులు ఇబ్బందులు పడతాయి.

| నియోజకవర్గంలో పశువుల వివరాలిలా.. | | |
|---|---|---|
| మండలం | ఆవులు/గేదెలు | గొర్రెలు/మేకలు |
| రాజాం | 12608 | 15460 |
| రేగిడి | 17921 | 17664 |
| వంగర | 11200 | 13600 |
| సంతకవిటి | 19397 | 21985 |

**వ్యాధి నివారణ..**

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరుచేయాలి. పశువుల పాకలను క్రిమిసంహారక మందులు, పౌడర్‌తో శుభ్రం చేయాలి. చనిపోయిన పశువులను గోతిలో పూడ్చాలి. వ్యాధి సోకిన పశువుల పాలను దూడలకు తాగించకూడదు. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి.

**చికిత్స..**

కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణాలతో కడిగి వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ చల్లి గ్లిజరిన్ కలిపి పూయాలి. వ్యాధి సోకిందని తెలిసిన వెంటనే వైద్యులను సంప్రదించి, అవసరమైన మందులు వాడాలి.

**వ్యాధి తర్వాత లక్షణాలు..**

వ్యాధి నుంచి కోలుకున్న పశువులు ఎక్కువ సేపు వాతావరణంలో వేడిని తట్టుకోలేవు. అధిక వేగంతో శ్వాస తీసుకుంటాయి. పశువుల శరీరంపై వెంట్రుకలు ఎక్కువగా పెరుగుతాయి. ఈ వ్యాధి రావడానికి ముందుగానే వ్యాక్సిన్ వేయిస్తే పశువులను కాపాడుకోవచ్చు. ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు ఈ వ్యాక్సిన్‌ను అందిస్తోంది. గాలికుంటు వ్యాధి నివారణకు పశువుల ఆస్పత్రుల్లో అయినా, వైద్యాధికారులు వ్యాక్సిన్లు వేసేటప్పుడు అయినా వ్యాక్సిన్లు వేయించుకోవాలి.

# సత్యసాయి బోధనలు అనుసరణీయం

వాడవాడలా భగవాన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి, మందిరాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక భజనలు, పూజలు చేశారు. బాబా పేరిట మధ్యాహ్నం అన్నదానం, వస్త్రదానం, వైద్యసేవలు వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం బాబా చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగిస్తూ చేసిన నగర సంకీర్తనతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సత్యసాయి బోధనలు అనుసరణీయమని, ఆయన బాటలోనే నడవాలని, ఆదర్శవంతమైన సమాజానికి పాటుపడాలని వక్తలు కోరారు. –బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం: బొద్దాంలో అన్నదానం చేస్తున్న సత్యసాయిబాబా భక్తులు



బొబ్బిలిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి



రాజాం సిటీ: సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు



రేగిడి విశ్వసాయి మందిరంలో వస్త్రదానం చేస్తున్న హైకోర్టు న్యాయవాది వేణుగోపాలనాయుడు



సంతకవిటి: సంతకవిటిలో నగర సంకీర్తనలో భక్తులు



బొబ్బిలిరూరల్: పూజలు చేస్తున్న భక్తులు



రామభద్రపురంలో బాబా చిత్రపటం ఊరేగింపు



వంగర: కొట్టిశలో కేక్ కటింగ్ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



తెర్లాం: డి.గదబవలసలో పూజలందుకున్న సత్యసాయిబాబా

# ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

బొబ్బిలిరూరల్: గిరిజనులు, దళితుల భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు మల్లపురెడ్డి శ్రీను హెచ్చరించారు. మండలంలోని నిమ్మపాడు గిరిజన రైతుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్న విషయం తెలుసుకున్న తహసీల్దారు..ఆ గ్రామానికి శనివారం వెళ్లి, ఆక్రమిత భూములను పరిశీలించారు. భూములను చదును చేసేందుకు ఆక్రమణదారులు వినియోగిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్కడి బాధిత గిరిజన రైతులతో మాట్లాడి,వారి సమస్యను మరింత క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఇక్కడి ఎనిమిది మంది రైతులకు సర్వే నంబర్లు 27, 28ల్లోని 14 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి, ప్రభుత్వం డీ–పట్టాలు అందజేసిందన్నారు. అయితే ఆ భూమిని సాలూరు మండలంలోని సన్యాసిరాజుపేటకు చెందిన అనీల్ అనే వ్యక్తి 99 ఏళ్లకు లీజు పేరిట బోగవలసకు చెందిన ఇంకుల నగేష్, తీళ్ల అప్పారావుల ద్వారా రైతులకు రూ.15 వేల చొప్పున చెల్లించారని, ఆ తర్వాత ఆ భూములను చదును చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని, రైతుల పట్టాదారు పాసుపుస్తకాలు పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో పంటలు పండించుకోవాలి తప్ప లీజులు, అమ్మకాలు వంటివి చేస్తే చెల్లవన్నారు. ఇదే మళ్లీ పునరావృతమైతే పట్టాలు రద్దు చేస్తామని గిరిజనులను హెచ్చరించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సర్వేయరు సతీష్ తదితరులు ఉన్నారు.



ఆక్రమిత భూములపై ఆరాతీస్తున్న తహసీల్దారు శ్రీను

## పరామర్శ



వంగర: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నంనాయుడు చికిత్స అనంతరం ఇంటి వద్దనే కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు చిన్నారావు ఇంటికి ఉదయం వెళ్లి, పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు పాల్గొన్నారు.



రాజాం: అంతకాపల్లి సర్పంచ్ చిన్నంనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: మండలంలోని శివ్వాం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఏనుగుతల గోపాలకృష్ణంనాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఏనుగుతల వెంకటనాయుడును పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ శనివారం పరామర్శించారు. గోపాలకృష్ణంనాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, పార్టీ నేతలు బొక్కేల సత్యంనాయుడు బొక్కేల వెంకట అప్పలనాయుడు, యలకల వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పతకాలు అందజేత

రాజాం సిటీ: స్థానిక డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను అక్షరయజ్ఞ ఫౌండేషన్ అధ్యక్షుడు పొట్టా సత్యనారాయణగుప్తా అందజేశారు. శనివారం ఆ పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఎ.శ్రావణికి బంగారు పతకం, డి.వివేక్, ఎ.జ్యోత్స్నలకు వెండి పతకాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకే ఈ పతకాలు అందిస్తున్నామన్నారు. కింది తరగతుల విద్యార్థులంతా వీరిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో బాగా రాణించాలని ఆకాంక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బంగారు పతకం అందజేస్తున్న అక్షర యజ్ఞ ఫౌండేషన్ అధ్యక్షుడు గుప్తా

## తల్లిదండ్రులను పూజించాలి

రామభద్రపురం: తల్లిదండ్రులను దేవుడితో సమానంగా పూజించాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి స్వామి తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించి, అక్కడి భక్తులతో కాసేపు మాట్లాడారు. భక్తిమార్గంలో అందరూ నడవాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సామాజిక ప్రయోజనాల కోసం పూజలు చేయాలని సూచించారు. ధర్మాన్ని కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలకు వెళ్లి, విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు కూడా కోడిని ఆదర్శంగా తీసుకుని పిల్లల పట్ల బాధ్యత వహించాలన్నారు. కోడి తన పిల్లలకు మిగతా పక్షుల మాదిరి మేత తినిపించదని, వాటంతట అవే మేత తినేలా నేర్పుతుందన్నారు. గద్ద అనే శత్రువు నీడను చూసి తన పిల్లలకు రెక్కలు కప్పి కాపాడుతుందన్నారు. అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని, అభివృద్ధి పథంలో నడవాలన్నారు. కార్యక్రమంలో అర్చకుడు నాగబాబు శర్మ, ప్రధానోపాధ్యాయుడుకె.కామేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పిస్తున్న కమలానందభారతి స్వామి

**ధర్మ సంస్థాపనే లక్ష్యం కావాలి**

బొబ్బిలి: ధర్మ సంస్థాపనే లక్ష్యం కావాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి పిలుపునిచ్చారు. మండలంలోని పక్కి గ్రామంలో సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, భక్తులను ఉద్దేశించి, ప్రసంగించారు. ప్రతిఒక్కరూ శాంతి, సామరస్యంతో జీవించాలన్నారు. అనంతరం కమలానంద భారతిని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సత్కరించారు. కార్యక్రమంలో సమరసతా ఫౌండేషన్ ప్రతినిధి ధూపం వాసు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

బాడంగి: మండల కేంద్రంలోని శివాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు సీహెచ్ వెంకటరమణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు. వివిధ కంటి సమస్యలతో బాధపడే వారు ఈ శిబిరంలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పక్కాగా సర్వే చేయాలి

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో జరుగుతున్న మరుగుదొడ్ల సర్వేతో పాటు హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ వంటి చర్యలను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శనివారం స్వయంగా పరిశీలించారు. పక్కాగా సర్వే చేపట్టాలని, పారదర్శకంగా వివరాల నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని తెలిపారు.

## మండల కేంద్రంలోనే 'గ్రీవెన్స్'

మెంటాడ: మండల కేంద్రంలోనే ప్రతీ సోమవారం గ్రీవెన్స్ సెల్(ప్రజాసమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు కె.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ప్రజలు ఏవైనా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌సెల్‌కు హాజరయ్యే అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని తెలిపారు. డిసెంబరు 2వ తేదీ నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులకు సంక్రాంతి నాటికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

బాడంగి: మండల కేంద్రంలోనే గ్రీవెన్స్ సెల్ నిర్వహించి, ప్రజాసమస్యలు పరిష్కరించడం జరుగుతుందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు.

## ఓటరు నమోదు పరిశీలన

బాడంగి: మండల కేంద్రం సహా మండలంలోని గజరాయునివలస, ఎరుకులపాకలు, గొల్లాది, పిన్నవలస, కోడూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంను తహసీల్దారు సుధాకర్ శనివారం పరిశీలించారు. జనవరి నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటుహక్కుకు అర్హులైన వారు కూడా ఓటరుగా నమోదుకు ఆసక్తి కనబరచాలన్నారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని గొల్లపల్లి పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో జేవీవీఎస్ రామమోహనరావు శనివారం సందర్శించి, ఓటరు నమోదు ప్రక్రియపై ఆరాతీశారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటరుగా నమోదు కావాలని సూచించారు.

## రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన.. రైస్‌మిల్లర్ల నుంచి రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చూడాలని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేపట్టాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపడుతున్న పనులు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, తహసీల్దారు ఎస్‌కే రాజు పాల్గొన్నారు.

## అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన



రాజాం: అగ్నిఅస్త్రం తయారీ తెలియజేస్తున్న ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ పద్మ

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో శ్రీవేంకటేశ్వర రైతు సంఘం మహిళలకు అగ్నిఅస్త్రం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ పద్మ తొలుత అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలు తెలిపారు. మొక్కజొన్న పంటను ప్రస్తుతం ఆశిస్తున్న కత్తెర పురుగు నివారణకు ఈ అగ్నిఅస్త్రం ఎంతగానో ఉపయోగపడుతోందని ఆమె తెలిపారు. ఐదు కిలోల వేపాకులు, ఓ కిలో పొగాకు, మరో కిలో పచ్చిమిరప, అరకిలో వెల్లుల్లి, పది లీటర్ల ఆవుమూత్రం కలిపి అగ్నిఅస్త్రం తయారు చేసుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగం పెంచితే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ రమాదేవి, ఐసీఆర్‌పీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో రైతులకు అగ్నిఅస్త్రం తయారీపై ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ అవగాహన కల్పించారు.

## అవగాహన సదస్సు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వినియోగదారుల రక్షణ మండలి ఆధ్వర్యంలో వినియోగదారుల చట్టంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. కన్జూమర్ కోర్టు న్యాయమూర్తి ఆర్.వెంకట నాగసుందర్ ఈ కార్యక్రమానికి హాజరై, చట్టాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, రక్షణ మండలి సభ్యురాలు శ్రీదేవి, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## మద్యం దుకాణం తరలించాలి

మద్యం దుకాణం తరలించాలని డిమాండ్ చేస్తూ బొబ్బిలిలోని మేదరిబంద వీధి మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. గతంలో ఇదే విషయమై పలుమార్లు నిరసన చేస్తే తరలిస్తామని దుకాణ యజమానులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది చెప్పారే తప్ప ఇంకా తరలించలేదు. దీంతో ఆ వీధి మహిళలు మరోసారి రోడ్డెక్కి బైఠాయించారు. షాపు యజమానులు, అధికారుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. శాంతియుతంగా పోరాడితే పట్టించుకోరా అని మండిపడ్డారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. –బొబ్బిలి

## నిరసన



వ్యాపార దిగ్గజం అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై బొబ్బిలిలోని కోవెల సెంటర్‌లో శనివారం నిరసనకు దిగారు. అదానీ అవినీతి, మోసాలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వమే అండగా నిలిచిందని విమర్శించారు. ఎప్పుడూ నిజాయితీగా ఉంటామని చెప్పుకునే చంద్రబాబు, పవన్‌లు ఎందుకు అదానీ అరెస్టును కోరడం లేదని ప్రశ్నించారు. దేశ సంపదను దోచుకునే వారికి కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు, బి.యుగంధర్, జి.గౌరి, శంకరరావు, వాసు పాల్గొన్నారు. –బొబ్బిలి